పామాయిల్ తోట దగ్ధంపై మంత్రి సీరియస్

విద్యుత్ అధికారులను విచారణకు ఆదేశించిన సీఎండీ

విచారణ చేపట్టిన వ్యవసాయ, విద్యుత్ అధికారులు

రఘునాథపాలెం, మార్చి 20: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రఘునాథపాలెం మండలం బావోజీతండాలో తొమ్మిది ఎకరాల పామాయిల్ తోట దగ్ధం కావడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ సీఎండీని విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో విద్యుత్ శాఖ ఖమ్మం ఎస్ఈ శ్రీనివాసాచారి, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం బావోజీతండాలో దగ్ధమైన పామాయిల్ తోటను పరిశీలించారు. పామాయిల్ తోట మీదుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని సదరు రైతు బానోతు శివలాల్ విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. పలుమార్లు స్వయంగా కూడా కలిశాడు. తీగలను తొలగించాలని విన్నవించాడు. అయితే పామాయిల్ రైతు విజ్ఞప్తిని ఏఈ పట్టించుకోలేదు. దీంతో బుధవారం వీచిన గాలులకు విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి మంటలు చెలరేగి పామాయిల్ తోట మొత్తం పూర్తిగా దగ్ధమైంది. దీంతో చేతికొచ్చిన పామాయిల్ పంట మొత్తం బూడిదైంది. అయితే గురువారం పత్రికల్లో వచ్చిన కథనాలను పరిశీలించిన మంత్రి తుమ్మల.. పామాయిల్ తోట కాలిపోవడంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. సదరు రైతుకు నష్టం చేసిన వారిపై చర్యలకు ఆదేశించారు. అయితే, విచారణకు వచ్చిన విద్యుత్ అధికారులు.. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న' చందంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. పూర్తిగా కాలిన పంటను పరిశీలించిన అధికారులు.. విద్యుత్ వైర్లు తొలగింపునకు అంచనాలు వేసి ఇస్తామని చెప్పడంతో సదరు రైతులు వారి తీరుపై మండిపడ్డారు. 'మీ నిర్లక్ష్యం కారణంగానే పామాయిల్ తోట దగ్ధమైనందున నష్ట పరిహారం చెల్లించండి' అని డిమాండ్ చేసినట్లు తెలిసింది. లేనిపక్షంలో న్యాయం కోసం మంత్రి తుమ్మలను కలుస్తానని స్పష్టం చేసినట్లు సమాచారం.

'మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి'

ఖమ్మం, మార్చి 20: మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. నగరంలోని 46వ డివిజన్‌లో గురువారం పర్యటించిన ఆయన.. అక్కడి శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాల పనులను పరిశీలించారు. కాలువలకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, కొత్తగా నిర్మించాల్సిన కాలువలు ప్రణాళిక ప్రకారం ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 8వ డివిజన్‌లో వాక్‌వేను, మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాక్‌వేలో వెలగని గుర్తైన లైట్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

'పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి'

మామిళ్లగూడెం, మార్చి 20: రైతులు పండించిన పెసర, కంది, మొక్కజొన్న వంటి పంటలకు కనీస మద్దతుకు తగ్గకుండా న్యాయమైన ధరను నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు గురువారం ఖమ్మంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. క్వింటా పెసలకు రూ.8,682, కందులకు రూ.7,550 చొప్పున కనీస మద్దతు ధరలు నిర్ణయించినప్పటికీ మార్కెట్‌లో జెండా పాటగా రూ.7,000కే కొనుగోలు చేస్తున్నారని, బయట అయితే రూ.6,000 కూడా మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, క్వింటా మొక్కజొన్నలకు రూ.2,225 మద్దతు ధర నిర్ణయించినప్పటికీ వ్యాపారులు మాత్రం రూ.2,100కు మించి కొనడం లేదని అన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు మరీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, లక్ష్మణ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ స్కూల్స్‌కు చేరిన కంప్యూటర్స్, సామగ్రి

ఖమ్మం అర్బన్, మార్చి 20: జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరాసీ కార్యక్రమం అమలు జరుగుతున్న ఏడు ప్రాథమిక పాఠశాలలకు గురువారం కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థుకు ప్రగతి పత్రాలను అందజేశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంవో) కేశవపట్నం రవికుమార్ మాట్లాడుతూ... తగిన సంఖ్యలో కంప్యూటర్లు అందుబాటులోకి వస్తున్నందున ఈ కార్యక్రమాన్ని మరింత మంది విద్యార్థులకు విస్తరించి ఎక్కువ మందికి కృత్రిమ మేధ ద్వారా కనీస సామర్థ్యాల సాధన పెంచుతామన్నారు.

ఫీడర్ బ్రేకర్లను ప్రారంభించిన విద్యుత్ సీజీఎం

రఘునాథపాలెం, మార్చి 20: మంచుకొండ సెక్షన్ పరిధిలోని బావోజీతండా, ఈర్లపూడి సబ్ స్టేషన్లలో రూ.13 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఫీడర్ బ్రేకర్లను విద్యుత్ శాఖ వరంగల్ సీజీఎం తేజావత్ సదర్‌లాల్ గురువారం ప్రారంభించారు. విద్యుత్ శాఖ చేపట్టిన వేసవి కార్యాచరణలో భాగంగా అంతరాయం లేని కరెంటును అందించేందుకు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం ఏడిఈ సంజీవ్‌కుమార్, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ఆదర్శం

కారేపల్లి, మార్చి 20: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి ప్రతి మహిళకు ఆదర్శమని ఐద్వా మండల నాయకురాలు కేసగాని నీలిమ అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో గురువారం ఐద్వా ఆధ్వర్యంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కె.జ్యోతి, ఎస్.నాగమణి, కె.పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రైతుసంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జక్కుల

బోనకల్లు, మార్చి 20: రైతు సంఘం జిల్లా మహాసభలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జక్కుల రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామారావు ఎంపిక పట్ల సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మావురూరి వెంకటేశ్వర్లు** S/o. లేటు కన్నయ్య, **వయస్సు:** 46 సం॥లు, **వృత్తి:** వ్యవసాయం,నివాసం: కల్లూరు గ్రామం మరియు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా, కల్లూరు సబ్ రిజిష్టారు వారి అధికార పరిధిలోని ఖమ్మం జిల్లా, కల్లూరు రెవిన్యూ మండల పరిధిలోని, కల్లూరు గ్రామపంచాయితీ ఏరియాలో కల్లూరు రెవిన్యూ రికార్డు దాఖలా సర్వే నెం. 507/ఉ మింజూమలే , **దాక్యుమెంట్ నెం: 2913/2020,** విస్తీర్ణము : 128.33 చ॥గ॥ స్థలము లేదా 107.29 చ॥మీ॥ నివేశన స్థలము మరియు ఇంటి నెం. 8-34 రేకుల ఇల్లు వైశాల్యం :703.56 చ॥అ॥ స్థిరాస్తికి సరిహద్దులు : **తూర్పు:** కాట్రాల కాశయ్య గారి స్థలము, **పడమర:** ఇందూరి రాజు గారి స్థలము, **ఉత్తరము :** జజ్జగాని శ్రీను గారి స్థలము, **దక్షిణము :** గ్రామపంచాయితీ రోడ్డు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **వైరా బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బంతోటి రాంబాబు**,W/o: దేవాదానం, **వయస్సు:** 56సం॥లు, **వృత్తి:**గృహిణి, **నివాసం:** ఇం.నెం. 2-5/2, రఘునాథపాలెం గ్రామం మరియు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి (3) రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా మరియు సబ్ జిల్లా, ఖమ్మం జిల్లా, కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని రఘునాథపాలెం మండలం, రఘునాథపాలెం గ్రామపంచాయితీ ఏరియాలో, రఘునాథపాలెం గ్రామం నందు గల AC Sheet Roof House, సంబంధిత ఖాళీ స్థల యుక్తముగా ఇంటి నెం.2-5/2, (Assessment No. 1743) గల మొత్తం విస్తీర్ణము :274-83 చ॥గ॥=229-79 చ॥మీ॥ అందు నిర్మించిన AC Sheet Roof Including Toilet నిర్మాణ వైశాల్యం : 321-00,చ॥అ॥, **దాక్యుమెంట్ : 5467/2024** స్థిరాస్తి యుక్తముగా గల స్థిరాస్తి మొత్తమునకు హద్దులు:**తూర్పు:** గ్రామపంచాయితీ రోడ్డు, **పడమర:** అంజోటి నాగేశ్వరరావు గారి ఇల్లు, **ఉత్తరము :** గ్రామపంచాయితీ రోడ్డు, **దక్షిణము :** కోటె కుమారి గారి ఇల్లు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెనుబల్లి: మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఖమ్మం రూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెనుబల్లి, మార్చి 20: సమాజంలో సమానత్వం రావాలంటే మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్య వ్యాపారం చేస్తూ ఆర్థిక బలం సాధిస్తే సాధ్యమవుతుందని, మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల కుటుంబాలకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని మండల మహిళా సమాక్య భవన్‌లో ఉషోదయ, ఆదర్శ మహిళా సమాఖ్యలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళా ఆర్థిక పురోగతిని, మహిళా శక్తి యూనిట్ల కార్యకలాపాలు, కొత్త గ్రూపుల ఏర్పాటు, బ్యాంకు లింకేజీలు, పొదుపు, కొత్త యూనిట్ల గ్రౌండింగ్, వ్యాపారంలో అభివృద్ధి పలుఅంశాలపై సభ్యులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా వ్యాపార రంగంలో నిలదిక్కుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటామన్నారు. మహిళల అభివృద్ధి కోసం, ఆర్థిక పరిస్థితి మెరుగు కోసం, ఉద్యోగ అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలల్లో మహిళలకు ప్రోత్సాహించడమే లక్ష్యంగా మహిళా శక్తి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హకులు కలిగి ఉండాలని, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని సూచించారు. జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధికి అందించే సూచనలు, అనుభవాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. తొలుత కలెక్టర్ మండలంలోని మండాలపాడు గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో ఎస్‌హెచ్‌జీ ద్వారా లబ్ధిపొందిన యూనిట్లు బిస్మిల్లా చికెన్ సెంటర్, కూల్‌డ్రింక్స్, షాప్, సాయిబాబా కిరాణం షాపులను సందర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ నూరొద్దీన్, అన్నపూర్ణ, లింగాల జ్యోతి, ప్రతాప్, రాధిక, రవీంద్రనాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యువ ఉత్సాహం-2025 పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం రూరల్, మార్చి 20: మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోగల ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యువ ఉత్సాహం-2025 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ కే నవీన్‌బాబు మాట్లాడుతూ యువ ఉత్సవ్ నిర్వాహణ ద్వారా యువతలో ఉన్నటువంటి సృజనాత్మకతను పెంపొందించేకుగాను ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఉత్సవ్‌కు తమ కళాశాలను ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం అధికారి కే బాన్‌చంద్, ప్రిన్సిపల్ గోపాల్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో ప్రైవేటు హాస్పిటల్ సీజ్

ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

కొణిజర్ల, మార్చి 20: కొణిజర్లలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి గురువారం సదరు వైద్యశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు, రిజిస్ట్రేషన్లు లేకుండా కొణిజర్లలో నిర్వహిస్తున్న సాయిరాం హాస్పిటల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యాధికారి డాక్టర్ శారదను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ సైదులు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ, మాస్ మీడియా అధికారి సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సీసీరోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి, మార్చి 20: రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 4 లక్షల 50 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టి రాబోయే నాలుగు సంవత్సరాల్లో 20లక్షల వరకు ఇందిరమ్మ ఇళ్లను కట్టే దిశగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం పెనుబల్లి, కల్లూరు మండలాల్లో ఆయన పర్యటించి ఇందిరమ్మ గృహ నిర్మాణానికి, సీసీరోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేసి, ఎస్సీ కమ్యునిటీహాల్‌ను ప్రారంభించారు. పెనుబల్లి మండలంలో రామచంద్రాపురం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుని గృహ నిర్మాణానికి, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.87 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లను సరి చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాసం పథకం రూపొందించారన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాలతో ప్రత్యేకంగా స్త్రీ టీ క్యాంటీన్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2 పెట్రోల్ పంపులను మహిళా సంఘాలు నిర్వహించేలా ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, ఎఫ్ఆర్ఓ పీ.స్నేహలత, తహసీల్దార్లు జీ.ప్రతాప్, సాంబశివుడు, ఎంపీడీవోలు అన్నపూర్ణ, చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

మహాసభ వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

వైరాటౌన్, మార్చి 20: పోరాటాల ద్వారానే రైతాంగ సమస్యలు పరిష్కారమవుతాయని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు అన్నారు. రైతు సంఘం జిల్లా 21వ మహాసభ గురువారం వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో జరిగింది. తొలుత రైతు సంఘం పతాకాన్ని సీనియర్ నాయకులు బండారుపల్లి ముత్తయ్య ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపాన్ని బాగం హేమంతరావు ఆవిష్కరించగా ఫొటో ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. దొండపాటి రమేశ్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జక్కుల రామారావు, బానోత్ రవి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. కార్యక్రమంలో కొండపర్తి గోవిందరావు, దండి సురేశ్, మహమ్మద్ మౌలానా, ఎర్రబాబు, మెడికంటి వెంకటరెడ్డి, జాగర్లమూడి రంజిత్, యామాల గోపాలరావు, ఏపూరి లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'కు నిధులు కేటాయించాలి: సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 20: శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తగినన్ని నిధులు కేటాయించలేదని సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. ఎంతో ముఖ్యమైన సీతారామ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.3 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ సీతారామ ప్రాజెక్టుకు మాత్రం కేవలం రూ.643 కోట్లే కేటాయించడం దారుణమని అన్నారు నిధుల కేటాయింపులే సరిగా లేకపోతే ఇక ప్రాజెక్టును ఎప్పటికి పూర్తిచేస్తారని ప్రశ్నించారు. నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, బండి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ద్వితీయ' పరీక్షలు

పరీక్ష కేంద్రంలో నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

కారేపల్లి, మార్చి 20: ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. అనంతరం ఇంటర్ చదువు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్తున్న తరుణంలో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

క్షయ నివారణపై అవగాహన

ముదిగొండ, మార్చి 20: మండలంలోని న్యూ లక్ష్మీపురంలోగల కస్తూర్బాగాంధీ పాఠశాలలో క్షయ వ్యాధి నివారణ కోసం గురువారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి అరుణాదేవి మాట్లాడుతూ వ్యాధిని ప్రాథమిక దశలోనే గర్తించి వైద్యం అందిస్తే తగ్గుతుందన్నారు. వ్యాధి నివారణ కోసం 6 నెలలు ఉచితంగా మందులు ఇస్తారన్నారు. సీహెచ్‌వో మధుసూదనరావు, సిబ్బంది రాణి, పద్మావతి, దేవయ్య, రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

సీఎం, మంత్రుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మం రూరల్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ కెటాయింపులో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, బడ్జెట్ కెటాయింపులకు సవరణలు చేసి విద్యారంగానికి 33శాతం నిధులు కెటాయించాలని పీడీఎస్‌యూ నాయకుడు యశ్వంత్ డిమాండ్ చేశారు. గురువారం రూరల్ పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప ఏరియాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి బటి విక్రమార్కల దిష్టిబొమ్మలను నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, వెంకటేష్, సిద్దు, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

వైరాలో..

వైరాటౌన్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, తక్షణమే బడ్జెట్ కేటాయింపులకు సవరణలు చేసి విద్యారంగానికి నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ లైబ్రరీ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు వెంకటేష్, మల్లూస్, స్పందన, అఖిల, నందిని, శైలజ, వెంకటేష్ పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించిందని పీడీఎస్‌యూ నాయకులు స్టాలిన్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 30% విద్యా రంగానికి బడ్జెట్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాము, మహేష్, వంశీ కృష్ణ, రాజు, రాకేష్, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీలకు అన్యాయం

ఖమ్మం రూరల్, మార్చి 20: రాష్ట్ర సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి నాయుడుపేట చౌరాస్తాలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాయకులు పీ వెంకట్రావ్, ఆరెంపుల ఉప్పలయ్య, బాలరాజు, సారయ్య, రామనాథం, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, రాములు, లక్ష్మయ్య, సైదులు పాల్గొన్నారు.

'విదేశీ విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

మామిళ్లగూడెం, మార్చి 20: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు జిల్లాలోని అర్హత, ఆసక్తిగల ఎస్సీ విద్యార్థులు 'విదేశీ విద్యానిధి' పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకుడు కస్తాల సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని వివరించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్సెస్, అగ్రికల్చర్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్ కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పీజీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు కావడంతోపాటు టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ, జీమాట్, పీటీఈల్లో అర్హత సాధించి ఉండాలని సూచించారు. ఈ పథకం కోసం telanganaepass.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో మే 19లోపు దరఖాస్తులు చేసుకోవాలని, దాని హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

'ఉప్పలపాటి' మృతి పట్ల 'నామా' విచారం

ఖమ్మం/ వేంసూరు, మార్చి 20: వేంసూరు మండలం దూళ్లకొత్తూరు గ్రామ